విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 28 ఆగస్టు 2024 8 పేజీలు

ఇసుక రవాణాకు ఆమోదం తప్పనిసరి

- టక్కు షీట్ లో డెలివరీ చిరునామా, వివరాలు తప్పనిసరి
- పీజీఆర్ఎస్ పెండింగ్ అర్జీల పై ప్రతివారం ఆడిటింగ్ : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ఉచిత ఇసుక కోసం రీచ్‌లకు వచ్చే వాహనాలకు స్లాట్ కేటాయింపు చేసి ట్రక్కు షీట్ జారీ చెయ్యాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం డివిజన్ మండల స్థాయి అధికారులతో ఇసుక రవాణా, పి జి ఆర్ ఎస్, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడుతో కలిసి కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలు జారీ చేస్తూ, ఇసుక కోసం వచ్చే వాహనాలకు జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి మాత్రమే బుకింగ్ పాయింట్ వద్దకు అనుమతించి, ఆమేరకు ట్రక్కు షీట్ జారీ చెయ్యాలన్నారు.

ఇసుక పంపిణీ విధానం ఎటువంటి అవకతవకలు లేకుండా ఎన్ఫోర్స్మెంట్ బృందాలు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం కోసం ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న 492లో 490 అర్జీలను అధికారులు పరిశీలించినట్లు తెలియ చేశారు. హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వద్ద ఒక అర్జీ, బిక్కవోలు మండల్ సర్వేయర్ వద్ద నిన్నటి వరకు పెండింగ్ గా చూపించిందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో ఉన్న పి జి ఆర్ ఎస్ అర్జీలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు.

ఇకపై పీజీఆర్ఎస్ పెండింగ్ అర్జీల పై ప్రతివారం ఆడిటింగ్ నిర్వహిస్తానని, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి కూడా వివిధ అంశాల పై ఆడిటింగ్ చేస్తారని పేర్కొన్నారు. పెండింగ్ అర్జీలు పరిష్కారం కోసం క్షేత్ర స్థాయిలో వ్యక్తిగతంగా పరిశీలన చేసి, వాటికి పరిష్కారం కోసం ప్రతి ఒక్క అధికారి వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి అని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు , డివిజనల్ అభివృద్ధి అధికారులు పి. వీణా దేవి, వి. శాంతా మణి, కలక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ ఎండీ ఆలీ పాల్గొన్నారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు సమస్యల్ని గుర్తించండి

విశాలాంధ్ర - అమలాపురం : కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్ అలైన్మెంట్ ఉన్న గ్రామాలలో ప్రత్యేక బృందాలను నియమించి రైల్వే లైన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్లో కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్ అలైన్మెంట్ మీద జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా గౌతమి వైనతేయ వశిష్ట నదులపై వంతెన నిర్మాణాలపై ముందుకెళ్లాలని రైల్వే అధికారులకు సూచించారు. కోటిపల్లి - మాగం వరకు రైల్వే లైన్

▶ మిగతా 2లో..

18 నిండితే ఓటరుగా నమోదు కావాలి

- కళాశాలల్లో ఓటుహక్కు, ఓటరు నమోదుపై అవగాహన
- ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లన్నీ ఒకే పోలింగ్ బూత్ లో ఉండాలి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 పై అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 పై జిల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ -2025 తయారీకి పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలు సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తులు అందించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించి, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు అధికారులు కృషి చేయాలన్నారు. .18 సంవత్సరాలు

▶ మిగతా 2లో

పేదల పట్టాలకు స్థలం చూపించాలి

- ఇంటి పన్ను, కరెంట్ బిల్లులు వెంటనే తగ్గించండి
- సీపీఐ శాఖ సమావేశంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర - రాజమండ్రి: ఎన్నికల ముందు రాజమండ్రి నగరంలో గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి ఎంపీ పేదలందరికీ ఇళ్ల స్థలాల కోసం పట్టాలు ఇచ్చారని కానీ ఆనాడు స్థలాలు చూపించలేదని నేడు కూటమి ప్రభుత్వం వెంటనే పేదలందరికీ స్థలాలు చూపించి వారికి గృహ నిర్మాణం చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్‌లో క్వారీ శాఖ సమావేశం టి. నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథు లుగా జిల్లా కార్యదర్శితో పాటు జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు జిల్లా సహాయకార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారి ఏరియాలో నెల కొన్న ప్రజా సమస్యలను శాఖ సభ్యులు నాయకత్వానికి వివరించారు. మధు మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల ముందు వేలాది మంది పేదలకు పట్టాలు

▶ మిగతా 2లో

రహదారికి మోక్షం

తీరనున్న పల్లెర్లమూడి వాసుల రహదారి కష్టాలు

విశాలాంధ్ర -నూజివీడు: పల్లె సీమల అభివృద్ధికి ఎన్ని వనరులున్నా వాటి వినియోగానికి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతాన్ని కలవడానికి రహదారులే ప్రధానం. పటిష్టమైన రహదారులున్న ప్రాంతాలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి పథంలో ముందుంటాయి. గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. కొందరు నేతలు తమకున్న పరిచయాలు, పలుకుబడితో కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లను పొంది రహదారుల అభివృద్ధికి కృషి చేసినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి అడుగు ముందుకు పడలేదు

▶ మిగతా 2లో

టీడీపీలోకి వైసీపీ నేతలు

వివరాలు 8లో..

అలసత్వం వద్దు -మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-భీమవరం : పారిశుద్ధ్యం నిర్వహణలో అలసత్వం వహించొద్దని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి సిబ్బందికి సూచిం చారు. టూ టౌన్ లోని పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, త్రాగు నీటి పైపులైన్సును పరిశీలించారు. అనంతరం ఆయన ఆక్రమణలు, టౌన్ ప్లానింగ్ తదితర విషయాలపై సచివాలయ సిబ్బందితో చర్చించ ఇది పలు సూచనలు చేశారు. వార్డ్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశిం చారు. కార్యక్రమంలో డిఇ శ్రీనివాస్, శ్రీనివాస్, ఎఇ శరత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన మంతెన

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.రాహూల్ కుమార్ రెడ్డిని టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంతెన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో గట్టి పునాదులు నిర్మించాలని తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

ప్రభుత్వ ఆశయాల సాధనకై అందరినీ కలుపుకు వెళ్తున్నాం :ఎమ్మెల్యే బడేటి

త్వరలో 29 మంది కార్పొరేటర్లు చేరిక : స్పష్టం చేసిన చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : కూటమి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి మరింత చురుగ్గా తీసుకెళ్ళాలన్న ఏకైక లక్ష్యంతో అందరినీ కలుపుకుని ముందుకు సాగుతున్నామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు పవర్ పేటలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఇతర నాయకులతో కలసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గడచిన మూడేళ్ళలో ఏలూరు నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, ఈ విషయంలో తాము ఏమీ చేయలేక పోయామన్న నిస్పృహలో ఉన్న నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, ఈడా మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు వంటి వారికి స్నేహ హస్తం అందించి పార్టీలో చేర్చుకున్నామన్నారు. వారితో పాటు మరొక 29 మంది కార్పొరేటర్లు కూడా పార్టీలో చేరనున్నారని చెప్పారు. మిగిలిన వారి విషయంలో పార్టీ కేడర్ మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు అభివృద్ధే లక్ష్యంగా అందరి ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి, వివిధ పక్షాల నేతలు, వర్తకులు, వ్యాపారులు, ఇతర వర్గాల అభిప్రాయాలను తీసుకుని నగరాభివృద్ధికి పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఏలూరు అభివృద్ధి చెందాలన్న తమ ఆశలు నెరవేరేలా తమను పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడా మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టీడీపీ నాయకులు ఎంఆర్డీ బలరాం, పెద్దిబోయిన శివప్రసాద్, కొల్లేపల్లి రాజు, మారం అను, ఆర్నేపల్లి తిరుపతి, పైడి వెంకట రావు, పందనాల శ్రీను, కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ తదితరులు పాల్గొన్నారు.

నమోదు కావాలి (1వ పేజీ తరువాయి)

వయస్సు నిండిన యువతను ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున నమోదు చేసేందుకు ప్రతీ కళాశాలలోనూ అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు అన్ని ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఓటరు నమోదు, చిరునామా మార్పు, ఫోటో ఓటరు గుర్తింపు కార్డులో ప్రస్తుత ఫోటో మార్పు, జాబితాలో పేరు తొలగింపు, అంశాలకు సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 పై ప్రజలకు అవగాహన కలిగించి వినియోగించుకునేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, జిల్లా పరిషత్ సీఈఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, ఆర్డీఓ ఎన్ .ఎస్. కె. ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాబ్జి, ముక్కంటి, ప్రభృతులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో యశస్విని ప్రతిభ

విశాలాంధ్ర ఏలూరు: స్థానిక బాలాజీ నగర్ శ్రీచైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని జె. యశ్వసిని శ్రీప్రకాష్ స్విమ్మింగ్ ఛాంపియన్స్ అకాడమీ నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలలో ప్రతిభను కనబరిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ తెలిపారు. ఈ సంద ర్భంగా అభినందన సభను ఏర్పాటు చేశారు. యస్వసిని, శ్రీప్రకాష్ స్విమ్మింగ్ అకాడమీ నిర్వహించిన పోటీలలో మూడు బంగారు పతకాలను రెండు వెండి పతకాలను సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభినందన సభను ఏర్పాటు చేసి విద్యార్థిని అభినందించారు.

సమస్యల్ని గుర్తించండి

(1వ పేజీ తరువాయి)

అలైన్మెంట్లో ఉన్న భూమిని డిసెంబర్ చివరి నాటికి రైల్వే అధికారులకు అప్పగిస్తామని, రైల్వే అధికారులు టెండర్ పనులు మొదలు పెట్టాలన్నారు. అమలాపురం నుంచి రాజోలు వరకు ప్రస్తుత రైల్వే లైన్ అలైన్మెంట్ ఉన్న గ్రామాలలో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, గ్రామ సర్వేయర్, వ్యవసాయ సహాయకులు, ఇతర సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో గ్రామానికో బృందాన్ని నియమించి ఆయా గ్రామాలలో రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి 14 రోజుల్లో నివేదిక సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా తమ శాఖల వారీగా ఉన్న ఇబ్బందులను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ సీఈవో పివివి సత్యనారాయణ, అమలాపురం కొత్తపేట రెవిన్యూ డివిజన్ అధికారులు జి. కేశవ వర్ధన్ రెడ్డి, వి సత్యనారాయణ, ఓఎన్జిసి, గెయిల్, మోర్త్ ప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

స్థలం చూపించాలి

(1వ పేజీ తరువాయి)

ఇచ్చారని, వారందరినీ ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేశారని కానీ స్థలాలు ఇప్పటికీ చూపించలేదని మధు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో మున్సిపాలిటీ అధిక ఇంటి పన్నులు వసూలు చేస్తున్నదని, దీనిని తగ్గించాలని పేదలు కోరారని మధు పేర్కొన్నారు. కరెంట్ బిల్లులు తగ్గిస్తామని ఆనాడు టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని వెంటనే కూటమి ప్రభుత్వం కరెంట్ బిల్లు తగ్గించాలన్నారు. మూడు నెలలుగా వాలంటీర్లకు జీతాలు ఇవ్వలేదని వాలంటీర్లు అందరూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని మధు పేర్కొన్నారు. జట్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉండాలంటె ముందు శాఖలు బలంగా ఉండాలని ప్రతినెల శాఖ సమావేశం జరగాలని ఆ సమావేశంలో ప్రజల సమస్యలను స్థానిక ప్రజల సమస్యలను జోడించి శాఖ స్థాయి నుండి సిపిఐ ను బలోపేతం చేయాలన్నారు.

సెప్టెంబర్ 1 2 3 తేదీలలో విశాఖపట్నంలో జరిగే ఏఐటియుసి జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనువాస్, ఏఐటియుసి నాయకులు రమణ ప్రకాష్ తదియతరులు పాల్గొన్నారు.

రహదారికి మోక్షం

(1వ పేజీ తరువాయి)

అడుగులు వెనక్కి అనేలా సాగింది. ఇదే కోవ లోకి వస్తుంది నూజివీడు ప్రాంతంలోని ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలను కలిపే రహదారి. గత వైసీపీ ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు అట్లూరి రమేష్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలసి నూజివీడు నియోజకవర్గంలోని పల్లర్ల ముడి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీంతో గన్నవరం నియోజకవర్గంలోని వేలేరు నుండి బొమ్ములూరు వరకు దాదాపు 15 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి 25 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ 2022 డిసెంబర్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాటి నుంచి రహదారి నిర్మాణం ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోగా నవ్యాంధ్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూజివీడు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఈ రహదారి పనులపై దృష్టి సారించడంతో పనులు వేగవంతమై దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయి. అతి త్వరలో నూజివీడు శాసనసభ్యులు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు ప్రార్ధసారథి ఆధ్వర్యంలో రహదారి ప్రారంభోత్సవానికి చర్యలు చేపడుతున్నారు. బాపులపాడు మండలం వేలేరు నుండి ప్రారంభమైన రహదారి అభివృద్ధి లో భాగంగా పల్లెర్ల మూడిలో ఒక కిలోమీటర్,సీతారాంపురంలో 200 మీటర్లు, వేలేరులో 600 మీటర్లు,కొయ్యూరులో 205 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం,రిటైనింగ్ వాల్ తో పాటు పక్క డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు అట్లూరి రమేష్ తెలిపారు. పల్లెర్లమూడి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణతో పాటు విద్యుత్ లైట్లు స్తంభాల ఏర్పాటుకు సుమారు 16 లక్షల రూపాయల తో చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మెట్ట ప్రాంతమైన నూజివీడు నియోజకవర్గంలో డెల్టాను తలపించేలా ఉండే సీతారాంపురం, పల్లెర్లముడి గ్రామాలు మూడు పంటలకు నెలవుగా ఉన్న సదరు పంటలను మార్కెట్కు తరలించేందుకు ధ్వంసమైన రహదారులతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని పల్లెర్లమూడి గ్రామ ప్రముఖులు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు అట్లూరి రమేష్ చొరవతో రహదారి అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఆయా గ్రామాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మంగళవారం నిర్మాణంలో ఉన్న రహదారిని సీతారాంపురం, పల్లెర్లమూడి తదితర గ్రామాల వాసులు దావులూరి కృష్ణమోహన్, యనమదల సిద్దయ్య, కనిగంటి రుష్యారావ్, యనమదల వాసు, బెజవాడ శ్రీనివాసరావు, తోమాటి సునీల్,బడిబాటి రాజేష్,పోల గాని భాస్కరరావు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

కళాశాలలో పరిశుభ్రతకు, క్రీడలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-లింగపాలెం: జూనియర్ కళాశాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు పరిశుభ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇంటర్ బోర్డ్ ఆర్ఐవో చంద్రశేఖర్ తెలిపారు. విద్యాలయాలలో క్రీడలు కనుమరుగవుతున్నాయని, పరిశుభ్రతపై పర్యవేక్షణ ఉండాలని విశాలాంధ్రలో ప్రచురించిన కథనంపై ఈయన స్పందించారు. రీజియన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని విద్యతో పాటు పరిశుభ్రత, క్రీడలను ప్రోత్సహించి విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. వీటికి సంబంధించి అన్ని కళాశాలల నిర్వాహకులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు.

మరోసారి దాతృత్వం చాటుకున్న శాసనసభ్యులు బొలిశెట్టి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గత రెండు రోజులుగా మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆయన గుంటూరు జిల్లాకు చెందిన ఒక విభిన్న ప్రతిభవంతురాలు సోమవారం ఆయనకు ఒక వినతిపత్రాన్ని అందించింది. తనకు ట్రై సైకిల్ కావాలని కోరడంతో సొంత నిధులతో ట్రై సైకిల్ కొని మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ రాజకీయ వ్యవహారాల ఇన్చార్జ్, ఎమ్మెల్సీ పి హరి ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసును పలువురు జనసేన నేతల అభినందించారు. కార్యక్రమంలో నరసాపురం జనసేన నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర-అగిరిపల్లి: శ్రీ కృష్ణ భగవానుడు ప్రజలకు ఆయురారోగ్యాలు, సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. మంగళవారం నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామంలో వేంచేసి వున్న శ్రీ కృష్ణుని గుడి సన్నిధానంలో నిర్వహించిన శ్రీకృష్ణుని జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొలుత వేదపండితులు అర్చకులు, మేళ తాళలతో పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి దుశ్శాలువతో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని సత్కరించి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ ఎన్. వేణు, ఎన్, సతీష్, డి. సాయి, ఎన్, వీర్రాజు, గ్రామ యాదవసంఘ నాయకులు, కమిటీ యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

29న ఐటీడీఏలో గిరిజన గ్రీవెన్స్ డే

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 29న బుట్టాయిగూడెం ఐ.టి.డి.ఏ కోట రామచంద్రపురంలో జిల్లా కలెక్టర్ ఏజెన్సీ మండలాలలో గ్రీవెన్స్‌డే నిర్వహించి ప్రజల నుండి విన్నపాలను స్వీకరించడానికి నిర్ణయం తీసుకున్నట్టు ఐటిడిఎ ఇన్‌చార్జి పివో, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు.

దీనిలో భాగంగా ఈనెల 29 గురువారం ఉదయం 10.30 గం. లకు కె.ఆర్.పురం, ఐ.టి.డి.ఏ., మీటింగ్ హాల్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించి, ఏజెన్సీ ప్రాంత ప్రజల నుండి గ్రీవెన్స్‌ను కలెక్టర్, ఏలూరు, చైర్మన్ ఐ.టి.డి.ఏ., వారు స్వీకరిస్తారని తెలిపారు.

ఆరోగ్యం పట్ల సిబ్బంది శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అప్పుడే విధులు సక్రంగా నిర్వహించగలుగుతారని భీమవరం రెండవ పట్టణ సిఐ కాళీ చరణ్ అన్నారు, మంగళవారం సిఐ అధ్వర్యంలో రెండవ పట్టణ పోలీస్ సిబ్బందికి ఉచిత రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీ చరణ్ మాట్లాడుతూ పోలీసు విధి నిర్వాహణలో తమ సిబ్బంది ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఉద్దేశంతో సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రిపోర్టుల ఆధారంగా వైద్యులను సంప్రదించి ఎస్.పి. ఆదేశాలతో వైద్య సహాయం అందించడానికి సిద్ధమవుతున్నామని కాళీ చరణ్ అన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి. యల్.టి. సి ప్రధానాచార్యుడు ఎస్. ఉగాది రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఆ పైన ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 3 చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు 9493482414 నెంబర్ ను సంప్రదించవచ్చన్నారు.

ఆక్వా రైతులు సంఘటితం కావాలి

విశాలాంధ్ర - గణపవరం: ఆక్వా రైతులు అందరూ సంఘటితం కావాలని, ఆక్వా రైతులు ఐక్యత వలన నాణ్యమైన సీడ్ ఫీడ్ లభించే విధంగా ఫిష్ ఫార్మర్లు ప్రొడ్యూసర్ ఆర్గనైజర్‌గా ఏర్పడాలని గణపవరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎన్. శివ రామకృష్ణ అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర గ్రామం సచివాలయం మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి మత్స్య శాఖ, ఎంపెడా వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్మెంట్ అథారిటీ అనుమతులు, ఎంపేడా ఎన్రోల్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్‌డిఓ మాట్లాడుతూ ఆక్వా కల్చర్‌కు అనుమతులు తప్పనిసరి అని, అనుమతులు లేని ఆక్వా రైతులు ఆక్వా వ్యాపార సముదాయాలు త్వరితగతిన అనుమతులు పొందాలని తెలిపారు. ఎంపెడ అధికారి దుర్గారావు మాట్లాడుతూ ఎంపెడ వారు జిల్లా నుంచి ఎగుమతి అత్మ ఉత్పత్తుల కోసం వారి వద్ద నమోదు చేయించుకోవాలని ఎపెండ దరఖాస్తు ప్రక్రియ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు రుద్రరాజు యువరాజు ఆక్వా రైతు రామచంద్ర రాజు, ఇందుకూరి ధనరాజు, మండలంలోని ఆక్వా రైతులు,ఆక్వా డీలర్లు, గ్రామ మత్స్య శాఖ సిబ్బంది భాస్కర్, నరేంద్ర, నాగేంద్ర,పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-కాళ్ళ : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాళ్ళ సి.ఐ. జగదీశ్వర్ రావు తెలిపారు. కాళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సి.ఐ. జగదీశ్వర రావు, ఎస్.ఐ. శ్రీనివాస్ అధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ. జగదీశ్వరరావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,సైబర్ నేరాలు,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. వీటి ప్రభావం వలన సమాజంలో అనేక ఘోర నేరాలు, చిన్నపిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. యువత భవిష్యత్తు అంధకారమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోషుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఆరోగ్యానికి దోహదం

జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: క్రీడలు జాతీయ సమైక్యత, మానసిక శారీరక ఆరోగ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.ప్రముఖ హకి క్రీడాకారులు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డి.ఎన్.ఆర్. కాలేజ్, ఎస్.సి.హెచ్.బి.ఆర్.ఎం. హైస్కూల్‌లో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ జ్యోతి, క్రీడా ప్రతిజ్ఞ కార్యక్రమాలను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యత భావాలను పెంపొందిస్తాయని, మానసిక, శారీరక ఆరోగ్యం అందించేందుకు దోహదపడతాయని అన్నారు. నేడు ఒలింపిక్స్ క్రీడలలో కూడా మన భారతీయ క్రీడాకారులు ఎన్నో విజయాలు సాధించడం గొప్ప విశేషమన్నారు. తొలుత క్రీడా ర్యాలీ డిఎన్నార్ కళాశాల క్రీడా మైదానం నుంచి సరోవర్ రోడ్డు మీదుగా అభిరుచి కెనాల్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి ఏం.రాజేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 29న ప్రశంసా పత్రలను అందిస్తామని అన్నారు.జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి ఎం.రాజేష్, ఎస్.ఎస్.ఏ పి.ఓ శ్యాంసుందర్, తహశీల్దార్ రవి రాంబాబు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, సిఐ కాళి చరణ్, డిఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయం నూతన భవనానికి అంచనాలు రూపొందించండి : జేసీ ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి సమగ్ర అంచనాలతో పరిపాలనా అమోదం కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన సెస్సు కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక సంస్థల నుండి సుమారు రూ.20 కోట్లు, గ్రంథాలయ సెస్సు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థకు బకాయివున్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రస్తుతం నిర్వహించబడుతున్న భవనం శిథిలావస్థలో ఉన్నందున వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టవలసివుందన్నారు. ఇందుకు స్థానిక సంస్థల నుంచి వున్న బకాయిలు రూ. 20 కోట్ల నుండి వెంటనే 10 శాతం చెల్లించేందుకు, స్థానిక సంస్థలు నిర్ణయించే ఆస్థి లేక ఇంటిపన్నుపై 8 శాతం చొప్పున గ్రంథాలయ సెస్సు డిమాండ్ కు సంబంధించిన వివరాలు కూడా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి యం. శేఖర్ బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణ, పలువురు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఆడిట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధుల పట్ల భయం వద్దు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: లెప్రసి, ఫైలేరియా పట్ల ప్రజలు భయపడవలసిన అవసరం లేదని మద్రి రంగనాథ్ అన్నారు. మంగళవారం బ్రైటర్, ఫ్యూచర్ డవలప్మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక సెంటర్ ప్రకాశం విజయ ఎంటర్ప్రైజస్ కార్యాలయంలో లెప్రసిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సంస్థ కో-ఆర్డినేటర్ ఆలమూరి బాబ్జి అధ్యక్షత వహించారు.ఈ సదస్సులో మద్రి రంగనాధ్ మాట్లాడుతూ లెప్రసీ వ్యాధిపై ప్రజలు బయపడవలసిన అవసరం లేదన్నారా? . కుష్టువ్యాధి ప్రారంభ లక్షణాలను గుర్తించి వాటిపై మందులు వాడితే, వ్యాధిదూరమవుతుందన్నారు. వాతావరణం మార్పుల వల్ల వచ్చే వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వస్తాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు, పిఎంపీలు, వైద్య సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలేటి న్యూటన్,గంట సుందర్ కుమార్,పాలపర్తి జోన, సత్యనారా యణ,తుళ్లూరి చంటి,గొల్ల రాజ్ కుమార్,కేసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నెం.203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య, కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070

రీజనల్ కార్యాలయం: H.No.54-15-1/2D, 4వ అంతస్థు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలని, గుణదల, NH-5వ రోడ్డు, విజయవాడ-520008

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) See rule 8(1)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ అఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు-2002 పరిధిలో ఈ క్రింది సంతకందారు మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పరిగణించునది), కార్పొరేట్ ఆఫీస్ యూనిట్ నెం:203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై-400 070, మహారాష్ట్ర, ఇండియా వద్ద మరియు బ్రాంచి చిరునామ: యర్రగుంటపల్లి రోడ్డు, బోయగూడెం, చింతలపూడి గ్రామం మండలం ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-534460 వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 3వ రూలుతో కూడిన సదరు చట్టం 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ క్రింది ప్రతి ఖాతాకు ఎదురుగా సూచించిన మొత్తమును చెల్లించవలసినదిగా సంబంధిత రుణగ్రహీత/లును సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసు/లు జారీ చేసినారు. రుణగ్రహీత/లు సదరు మొత్తమును తిరిగి చెల్లింపు చేయుటలో విఫలమైనారు. కనుక రుణగ్రహీత/లుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సదరు చెప్పిన నియమావళి యొక్క రూలు 8 తో కూడిన దసరు చట్టం 13 (4) విభాగం పరిధిలో అతనికి / ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తి / ఆస్తులను క్రింది సంతకందారు ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీన స్వాధీన పరచుకొనినారు. రుణగ్రహీత / లుకు ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి లోను అగ్రిమెంటు ప్రకారం చెల్లించవలసిన మొత్తము మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సదరు చట్టం 13వ విభాగం (8)వ ఉప-విభాగం నియమావళి పరిధిలో తగిన సమయం లభించునని రుణగ్రహీతలకు సూచించటమైనది.

వ.నెం.1, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESCPD01043501/1350610, **రుణగ్రహీత / సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామ:-** శ్రీ మేడూరి మద్ది రాముడు, తండ్రి: వెంకటేశ్వరరావు, శ్రీమతి మేడూరి మరియమ్మ, భర్త: వెంకటేశ్వరరావు & సర్వే నెం.384, హెచ్ నెం.17-134, కాంచనగూడెం, ప్రగడవరం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534461 **హామీదారు పేరు మరియు చిరునామా:** శ్రీ మేడూరి నాగరాజు, తండ్రి: వెంకటేశ్వరరావు, హెచ్ నెం.19-117/1, కాంచనగూడెం, ప్రగడవరం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534461. **డిమాండ్ నోటీసు తేది:** 20-10-2023, డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం: రూ.1,60,604/- (ఒక లక్ష అరవైవేల ఆరువందల నాలుగు రూపాయలు) **స్వాధీన పరచుకున్న తేది:**23-08-2024, స్థిరాస్తి వివరములు: ఎ.పి, పశ్చిమ గోదావరి, చింతలపూడి, ప్రగడవరం, కాంచనగూడెం, హెచ్ నెం.17-134, సర్వే నెం.384లోని 1305 చ॥అడుగులు కలిగిన ఆస్థికి **హద్దులు:** పడమర: నీలం గంగరాజు గారి ఖాళీ స్థలం, తూర్పు: పంచాయితి రోడ్డు, దక్షిణం: మేడూరి రాఘవులు గారి ఇల్లు, ఉత్తరం: కళాబత్తుల నాగార్జున గారి ఖాళీ స్థలం.

వ.నెం.2, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESCPD01058378/1379014, **రుణగ్రహీత / సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామ:-** శ్రీ రాచప్రోలు శ్రీనివాసరావు, తండ్రి: వెంకటేశ్వరరావు, శ్రీమతి రాచప్రోలు నాగమణి & సర్వే నెం.16/7, హెచ్ నెం.1-158, ప్రగడవరం, తిమ్మరెడ్డిపల్లె, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534461 **హామీదారు పేరు మరియు చిరునామా:** శ్రీ గద్దె వెంకటేశ్వరరావు, తండ్రి: నాగభూషన్, సర్వే నెం.16/7, హెచ్ నెం.3-1, ప్రగడవరం, తిమ్మరెడ్డిపల్లె, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534461. **డిమాండ్ నోటీసు తేది:** 20-10-2023, డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం: రూ.1,26,140/- (ఒక లక్ష ఇరవైఆరువేల నూటనలబై రూపాయలు) **స్వాధీన పరచుకున్న తేది:**23-08-2024, స్థిరాస్తి వివరములు: ఎ.పి, పశ్చిమ గోదావరి, చింతలపూడి, తిమ్మరెడ్డిపల్లె, ప్రగడవరం, హెచ్ నెం.1-158, సర్వే నెం.61లోని 1305 చ॥అడుగులు కలిగిన ఆస్థికి **హద్దులు:** పడమర: మేరుగు ముక్కయ్య గారి వ్యవసాయ కాలువ, తూర్పు: రాచప్రోలు మహాలక్ష్ముడు గారి ఇల్లు, దక్షిణం: గద్దె నాగభూషణం గారి ఇల్లు, ఉత్తరం: దారి & రాచప్రోలు సత్యనారాయణ.

వ.నెం.3, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESCPD01067681/1395667, **రుణగ్రహీత / సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామ:-** శ్రీ రాచప్రోలు నవీన్, తండ్రి: కృష్ణ, శ్రీ రాచప్రోలు కృష్ణ, శ్రీమతి రాచప్రోలు సుబ్బమ్మ & సర్వే నెం.202, డి.నెం.9-1, యస్‌సి కాలని, యర్రగుంటపల్లె, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534460, **హామీదారు పేరు మరియు చిరునామా:** శ్రీ బొల్లవరపు విజయశేఖర్, తండ్రి: సోమరాజు, హెచ్ నెం.2-253, రామాలయం వీధి, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534464. **డిమాండ్ నోటీసు తేది:** 15-11-2022, డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం: రూ.2,62,152/- (రెండులక్షల అరవైరెండువేల నూటయాభైరెండు రూపాయలు) **స్వాధీన పరచుకున్న తేది:**23-08-2024, స్థిరాస్తి వివరములు: ఎ.పి, పశ్చిమ గోదావరి, చింతలపూడి, యర్రగుంటపల్లె, యస్‌సి కాలని, డి.నెం.9-1, సర్వే నెం.202లోని 1737 చ॥అడుగులు కలిగిన ఆస్థికి **హద్దులు:** పడమర: ఆర్ & బి రోడ్డు, తూర్పు: కాపుదాసి మాదాసు గారి స్థలం, దక్షిణం: పావులూరి శ్రీను గారి ఇల్లు, ఉత్తరం: రాచప్రోలు మరియమ్మ గారి ఇల్లు.

వ.నెం.4, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESCPD01053977/ 1351815, **రుణగ్రహీత / సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామ:-** శ్రీ మురుదుడ్ల రాంబాబు, తండ్రి: వెంకటేశ్వరరావు, శ్రీమతి మురుదుడ్ల కవిత, భర్త: రాంబాబు & సర్వే నెం.1041, హెచ్ నెం.18-236, బట్టువారిగూడెం (గ్రా), చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534464, **హామీదారు పేరు మరియు చిరునామా:** శ్రీ అందుగుల శ్రీనివాస్, తండ్రి: లక్ష్మయ్య, హెచ్ నెం.19-32, బట్టువారిగూడెం (గ్రా), చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534464. **డిమాండ్ నోటీసు తేది:** 20-10-2023, డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం: రూ.1,28,878/- (ఒక లక్ష ఇరవై ఎనిమిదివేల ఎనిమిదివందల డెబ్బైఎనిమిది రూపాయలు) **స్వాధీన పరచుకున్న తేది:**26-08-2024, స్థిరాస్తి వివరములు: ఎ.పి, పశ్చిమ గోదావరి, చింతలపూడి, బట్టువారిగూడెం (గ్రా), హెచ్ నెం.18-236, సర్వే నెం.1041లోని 1305 చ॥అడుగులు కలిగిన ఆస్థికి **హద్దులు:** పడమర: దారి, తూర్పు: పంచాయితి ఖాళీ స్థలం, దక్షిణం: ముదుదుడ్ల రాంబాబు గారి ఖాళీ స్థలం, ఉత్తరం: దాసరి పుష్ప గారి ఇల్లు.

స్థలం: విజయవాడ — **సం/- అధీకృత అధికారి**

తేది: 23-08-2024 — **M/s. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

100 రోజుల ప్రణాళిక సాధన నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని అన్ని శాఖల అధికారులు 100 రోజుల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్

వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, ఐసిడిఎస్, పౌర సరఫరాలు, తదితర శాఖల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వారికి నిర్దేశించిన లక్ష్యాల్లో 100 రోజులలో పూర్తి చేయవలసిన లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, ఆయా పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, అటవీశాఖాధికారులు రవిశంకర్, హిమశైలజ,డ్వామా పీడీ పి. రాము, డిఎంహెచ్ఓ డా. శర్మిష్ఠ, డీఈఓ అబ్రహం తదితరులు పాల్గొన్నారు

80శాతం పూర్తయిన ఈ- పంట

విశాలాంధ్ర – పాలకోడేరు: పాలకోడేరు మండలంలో ఉన్న 14 గ్రామ పంచాయతీలలో ఈ ఖరీఫ్ సీజన్లో 10500 రైతులు వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. నారాయణ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఈ- పంట కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పూర్తయినట్లు తెలియజేశారు. ఈ పంట ముఖ్య

ఉద్దేశం అతివృష్టి అనావృష్టి సంభవించిన, నకిలీ విత్తనాలు, గిట్టుబాటు ధర లేకపోవడం, పండించిన పంటకు మద్దతు ధర దక్కకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పెట్టుబడి సైతం చేతికందకపోవడం ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్నారు.రైతుల సాగు వివరాలన్నీ యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫామ్ (యుడిపి) లో నమోదు చేస్తారన్నారు. నమోదు ఇలా – మొదట రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి వివరాలు నమోదు చేయించాలన్నారు. ప్రతి ఒక్క రైతు సోదరులు తప్పనిసరిగా ఈ-పంటలో వివరాలన్నీ సక్రమంగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి నారాయణరావు రైతులకు విజ్ఞప్తి చేశారు.

అన్న క్యాంటీన్‌పై తప్పుడు ప్రచారాలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి ఖండన

విశాలాంధ్ర-తణుకు: ఇటీవల తణుకు పట్టణంలోని అన్న క్యాంటీన్ శుభ్రతపై, ప్లేట్ లు ఎంగిలి నీటిలో కడుగుతున్నారు అంటూ సామాజిక మాధ్యమాలలో వచ్చిన ప్రచారాలు పూర్తిగా అవాస్తమని తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మండిపడ్డారు. స్పష్టంగా "చేతులు కడుగు స్థలము"

అని రాసి ఉన్నా కావాలని బురద చల్లటానికి, చేతులు కడిగే సింకులో అన్నం తిన్న ప్లేట్లు పడేసి అదే సమయంలో చేతులు కడిగే సింకులో బ్లాక్ అవ్వటంతో సిబ్బంది వచ్చి ఆ ప్లేట్లు చెత్త తీస్తున్న సమయంలో ఒక 40 సెకండ్ల వీడియో తీసి వైసీపీ నాయకులు సిగ్గు లేని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా తణుకులో మాజీ మంత్రి మంత్రి గత వైసీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ లను బలవంతంగా మూసి వేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే పేద వారి తరుపున పోరాటం చేయగా " రాజన్న క్యాంటీన్ " అని మొదలుపెట్టి పది రోజులు గడవకముందే మూసి వేసిన పరిస్థితి ఉందని అన్నారు.

జిల్లాలో 14,383 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

విశాలాంధ్ర – ఏలూరు : జిల్లాలో ఇంతవరకు మొత్తం 14,383 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేశామని మైనింగ్ డిడి రవికుమార్ తెలిపారు. ఈనెల 27వ తేదీ మంగళవారం నాడు 3 బుకింగ్ సెంటర్ల ద్వారా 2,570 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా జరిగిందన్నారు. మూడు బుకింగ్ సెంటర్ల లో 141 ఆర్డర్లు నమోదు కాగా అన్నిటికీ ఇసుక సరఫరా కాబడింది. 124 లారీలు,16 ట్రాక్టర్లు, ఒక 6 టైర్ల లారి ద్వారా ఇసుక సరఫరా చేయబడిందన్నారు. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210,చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద రూ.538, విజరాం స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.362 కు ఇసుకను విక్రయదారులకు సరఫరా చేయడం జరిగిందన్నారు.

ప్రస్తుతం ఇక్కడ పెండింగ్ లేకుండా అందిన బుకింగ్ మేరకు ఇసుక వినియోగదారులకు సరఫరా చేయడమైనది. ఇసుక సరఫరాపై ర్యాండంగా 25 మంది వినియోగదారులకు ఫోన్ చేయగా నూరు శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-నర్సాపురం: పట్టణం 1వ వార్డు శ్రీహరిపేట లో నేషనల్ హెల్త్ మిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలు తున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తద్వారా దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్యం చేసినా వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన వైద్య సదుపాయం పొందాలని తెలిపారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహించవద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఉప అధికారి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మోహన, డాక్టర్ సత్య భూషణ్, జనసేనపార్టీ నాయకులు బందెల రవీంద్ర, దొండపాటి స్వాములు, వలవల నాని తదితరులు పాల్గొన్నారు.

జివిఎస్వి ఆర్ఎం పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర – పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలో ఉన్న జివి ఎస్వి ఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్దేపల్లి గంగరాజు ధర్మ సత్రం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఫౌండర్ అండ్ ఫ్యామిలీ చైర్మన్ అద్దేపల్లి మోహన్ దాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమం మంగళవారం జరిగింది. మొత్తం 200 మంది విద్యార్థులకు శ్రీఆచారి చేతుల మీదుగా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ముందుగా ఈ సంస్థ ద్వారా జరిగే సేవా కార్యక్రమాలను విద్యార్థులకు శ్రీ ఆచారి వివరించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా విద్యార్థులకు ఉచిత భోజనము, పుస్తక దానం, ఉచిత హోమియో వైద్యం, పేదలకు మందులు పంపిణీ, పేద మహిళలకు వస్త్ర దానం, మొదలైన కార్యక్రమాలు తమ సంస్థ చేపడుతుందని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మంతెన సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను విద్యావంతులను చెయ్యాలి

విశాలాంధ్ర-పోడూరు : ఎటువంటి వివక్షత చూపకుండా తమ ఆడపిల్లలను తల్లిదండ్రులు విద్యావంతులను చేయాలని ఎంపీడీవో డి సుహాసిని అన్నారు.పోడూరు ఎంపీడీవో కార్యాలయం నందు మంగళవారం ఐసిడిఎస్ సిడిపిఓ, సిహెచ్ ఇందిర అధ్యక్షతన జరిగిన భేటీ పడావో బేటి బచావో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ డి.సుహాసిని మాట్లాడుతూ గ్రామాలలో ప్రాథమిక, ఉన్నత విద్యా స్థాయిలో బడి మానేసిన బాల, బాలికలు ఎవరున్నా గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్చడానికి కృషి చెయ్యాలని ఎంపీడీఓ సూచించారు. ఐసిడిఎస్ సిడిపిఓ, సిహెచ్ ఇందిర మాట్లాడుతూ ఆడపిల్లల లింగ నిష్పత్తి పెరగాలన్నారు. 95 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రి లలో జరిగేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది చూడాలన్నారు. తహసిల్దార్, సయ్యద్ మౌలానా ఫాజిల్, మండల రెవెన్యూ అధికారి, కందుల రాంబాబు, ఐసిడి ఎస్ సూపర్ వైజర్లు వీఆర్వోలు మహిళా పోలీసులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలకు సమస్యలను వివరించిన ఎమ్మెల్యే వేగుళ్ల

విశాలాంధ్ర-పాలకొల్లు: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో

మర్యాద పూర్వకంగా కలిశారు. కలయికలో భాగంగా మండపేట నియోజకవర్గం లోని సమస్యలను విపులంగా మంత్రికి వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్య టిడిపి నేతలు పాల్గొన్నారు.

కంగనారౌనత్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర- కామవరపు కోట: రైతు ఉద్యమంపై బిజెపి మహిళా పార్లమెంటు సభ్యురాలు సినీనటి కంగనా రౌనత్ చేసిన వివాదాస్పద అనుచిత వ్యాఖ్యలను సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశరతగా రైతులకు క్షమాపణ చెప్పాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కంగనా రనత్ పై క్రిమినల్ కేసు

నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమెపై ప్రజా బహిష్కరణకు పిలుపునివ్వల్సి వస్తుం దని హెచ్చరించారు. బిజెపి ఎంపీ కంగనా నోటి దురుసును సిపిఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మండల కార్యవర్గ సభ్యులు జి. సత్యనారాయణ, చలమల శ్రీనివాసరావు, స్వామి దాసు, మహిళా సమాఖ్య నాయకులు టి.రాములమ్మ, పెండ్లి నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కరేటి నరసింహులు, కంగనా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

క్రీడా దుస్తులు వితరణ

విశాలాంధ్ర – మండవల్లి : చిన్ననాటి నుంచి విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని లాయర్ గురజాడ ఉదయశంకర్ అన్నారు.ఈ సందర్భంగా లోకముడి జిల్లా పరిషత్ హై స్కూలులో మంగళవారం

గురజాడ ఉదయ్ శంకర్, తలారి వెంకట రామారావు, కర్రేటి శివకృష్ణ వార్ల ఆర్థిక సహాయంతో తెలుగుదేశం రాష్ట్ర నాయకులు తలారి రాజేష్, బూత్ కన్వీనర్ గడిదేసి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు సమక్షంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడ స్పూర్తిని అవగాహన కల్పించి, దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్ధినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవికుమార్‌ను కలిసిన జీలుగుమిల్లి ఎస్ఐ

విశాలాంధ్ర – జీలుగుమిల్లి : మాజీ జెడ్పీటీసీ, ఉభయ పశ్చిమగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి గద్ద మణుగు రవి కుమార్ నివాసం వద్ద మంగళవారం జీలుగుమిల్లి ఎస్ఐ పి.నవీన్ కుమార్ కలిశారు. మండలం లోని శాంతిభద్రతల పరిరక్షణ కోసం లా అండ్ ఆర్డర్

మెరుగుపరచటం వంటి అంశాలపై చర్చించారు. మండలంలోని సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు

సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నగరంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి అమలు చేయడం జరుగుతుందని నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు అధికారులతో కలిసి 50వ డివిజన్ భాస్కర్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ 50వ వార్డు భాస్కర్ నగర్ లో పర్యటించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, శానిటేషన్ , త్రాగునీరు, కల్వర్టుల నిర్మాణం, డ్రైనేజీ వంటి పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ అంశంపై నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షించడం జరిగిందని త్వరితగతిన ప్రాధాన్యత క్రమంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణం పనులను చేపడతా మన్నారు. ఇందుకు అవసరమయ్యే ప్రతిపాదన సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు సూచించడం జరిగిందని పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా మెరుగైన శానిటేషన్ అందించే దిశగా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను సూచించామన్నారు. నగర ప్రజలకు ఏ విధంగా ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత ఎమ్మెల్యేగా నేను తీసుకుంటానన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ, అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని తెలియజేశారు. పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా త్వరలో ఈ ప్రాంతంలో ఒక పార్క్ కూడా నిర్మించే కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.నవీన్ కుమార్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలుంటే కఠిన చర్యలు

విశాలాంధ్ర - దేవరపల్లి: ప్రతి సంవత్సరం విధిగా ఎలక్ట్రానిక్ కాటాలు వాడేవారు క్రమం తప్పకుండా ఒకసారి డిపార్ట్మెంట్ వారితో కాటాలు సీలు వేయించుకోవాలని డివిజన్ తూనికలు కొలతల శాఖ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ జీవి ప్రసాద్ పేర్కొన్నారు. దేవరపల్లిలో కాటాల వ్యత్యాసాలను గుర్తించిన ఎడల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . దేవరపల్లిలో సోమవారం చౌక ధరల కాటాలను ఎలక్ట్రానిక్ కాటాలను సీలు వేయటానికి తహశీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకుని పరిశీలించారు. సీల్ వేయించుకొని ధ్రువపత్రాలు పొందాలని అన్నారు . డీలర్లు వారి ఎమ్మెల్యేస్ పాయింట్లు వద్దనుండి రైస్ తీసుకునే సమయంలో పాటించవలసిన విధి విధానాలను ప్రసాద్ వివరించారు. ఉద్దేశపూర్వకంగా తక్కువ తూనికలు తూచినట్లయితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఈ నెల 31న ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలనీ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు.ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను మంగళవారం స్థానిక విలేకరులకు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం లోని రాయల్ కన్వెన్షన్ హాల్ నందు ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటల నుండి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఎన్డీఏ కూటమి నాయకులు,అభిమానులు,ప్రజలు స్వచ్ఛందం గా పాల్గొని రక్త దాన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు సేవ కార్యక్రమాల్లో భాగంగా ప్రమాదాలు భారిన పడినవారి కోసం,ఆపదలో ఉన్న రోగులు కోసం, రక్తం లేక ఇబ్బంది పడే వారిని ఆదుకోవాలనే సంకల్పంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల తెలిపారు.

ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు

విశాలాంధ్ర - కాకినాడ : విపత్తులు సంభవించినప్పుడు సమర్థవంతంగా రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహించేలా జిల్లాలో గడిచిన 20 రోజులు పాటు ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం లావణ్య, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమ్మాండర్ మన్మోహన్ యాదవ్ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్డీఆర్ఎఫ్ బృందానికి అభినందనలు తెలియజేశారు. జిల్లా 20 రోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో విపత్తుల నివారణ చర్యల మీద, విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విపత్తుల తరువాత జరిగే పరిణామాలను ఎదుర్కొనే నైపుణ్యాలపై ప్రజలకు, విద్యార్థులకు, రెవెన్యూ అధికారులకు, ఆసుపత్రి సిబ్బందికి, రసాయన ఫ్యాక్టరీల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతలకు సంబంధించి 6 మండలాలలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించారన్నారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమ్మాండర్ మన్మోహన్ యాదవ్..విపత్తు నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎం లావణ్య కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు.

గోదావరి గట్టు పటిష్టతకు తోడ్పాటు అందించాలి

హోంమంత్రి, దేవాదాయ శాఖ మంత్రులను కలిసిన ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : తమ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో పాటు పేదల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏపీ హోంమంత్రి వంగాలపూడి అనిత, ఏపీ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలను అమరావతి సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలపై చర్చించారు. సీతానగరం మండలంలోని గ్రామ పరిధిలో ఆయా గ్రామాల వద్ద ప్రతి ఏటా అఖండ గోదావరి వరద ఉధృతికి ఎడుమ ఒడ్డు కోతకు గురవుతున్నట్లు వివరించారు. గట్టు పటిష్టకు,అలాగే గట్టు పరిధిలో రాతి పిచింగ్ ప్లాట్ఫారమ్ ఏర్పాటు కి అలాగే ఎబిఎల్బి బండ్పై బిటి రోడ్డు నిర్మాణం తదితర అభి వృద్ధి కార్యక్రమాలకు రు: 151.23 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు.పనులను విపత్తు నిర్వహణ శాఖ నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని హోం మంత్రికి అందజేశారు. అనంతరం ఏపీ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామ నారాయణ రెడ్డిని గౌరవపూర్వకంగా కలిసి కోరు కొండ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయ భూములను 22(ఎ)(1)(సి) రిజిస్ట్రేషన్ చట్టం నుండి నిషేధ భూములను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.రంగనాథ స్వామి ఆలయంలో రాజ గోపురం పునర్నిర్మాణం, కోరు కొండ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయం అభివృద్ధి, కనుపూరులో శివపార్వతుల విగ్రహం ఏర్పాటు, కనుపూరు కొండ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయుట, కోరుకొండ లో నూతనంగా టీటీడీ కళ్యాణ మండపం మంజూరు, శ్రీవాణి ఆలయాల చెల్లింపు వివరాలు, 2027 లో జరగబోయే పుష్కరాలకు సంబంధించి టెంపుల్ టూరి జం డెవలప్మెంట్ తదితర అంశాలను మంత్రికి విన్న వించి వినతిపత్రాన్ని అందజేశారు.

సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టండి

విశాలాంధ్ర - అమలాపురం, వన్నె చింతలపూడి : సైన్స్తోనే నాగరికత మరింత అభివృద్ధి సాధించిందని, శాస్త్ర విజ్ఞానం పురోభివృద్ధి సాధించడంతో సమాజం కొత్త పుంతలు తొక్కిందని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం కమలకుమారి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఏ మధుసూదన్ రావులు పిలుపునిచ్చారు. మంగళవారం అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గుబ్బల నాగ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల కుమారి, మధుసూదన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని, ప్రతి విద్యార్థిలో ఏదో ఒక అంశంలో సృజనాత్మకత దాగి ఉంటుందన్నారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ళ శివప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాలలో భారతదేశం ప్రపంచ దేశాల సరసన నిలుచుందన్నారు. దానికి భారతీయ శాస్త్రవేత్తలే పునాదివేశారన్నారు. అంతరిక్ష శాస్త్ర పితామహుడు విక్రమ్ సారాభాయ్ వేసిన బాటలో ఎందరో శాస్త్రవేత్తలు దేశాన్ని పురోగమన వైపు నడిపించారన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అమలాపురం గుబ్బల సూర్య ప్రకాష్ రావు, యంగ్ మెన్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వాకాడ చిన్న, గౌరవాధ్యక్షులు నరాల కృష్ణ కుమార్, సాంస్కృతిక సలహాదారు పిల్లి గోవిందరాజులు తదితరులు మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే జిల్లా స్థాయిలో వారధి పోటీ పరీక్షల్లో భాగంగా వ్యాస రచన వక్తృత పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయతలుగా అడబాల నరసింహారావు, వరద శ్రీనివాస్, సుబ్బరాయ శర్మ, కాశీ దుర్గ భవాని, జివిఎస్ఆర్ లక్ష్మి, బ్రహ్మానందం, కెఆర్ఎస్ పద్మావతి వ్యవహరించారు.

క్రీడా ప్రతిభా అవార్డుకు చింతలపల్లి జడ్పీ హైస్కూల్

విశాలాంధ్ర - రాజోలు : చింతలపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్, క్రీడా ప్రతిభ అవార్డుకు వరసగా రెండోసారి, ఎంపిక అయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొంగ జానకి రామయ్య తెలిపారు. గత సంవత్సరంలో స్కూల్ గేమ్స్లో, జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను, కమిటీ ఎంపిక చేసి ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం నాడు, జిల్లా ఉన్నత అధికారులు అవార్డు అందచేస్తారని, గత సంవత్సరం తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ఈ సంవత్సరం 151 పాయింట్లతో జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, క్రికెట్, రైఫిల్ షూటింగ్, సైక్లింగ్, ఆర్చరీ, రెజ్లింగ్, పోటీలలో గత సంవత్సరం 31, మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించడం వలన ఈ అవార్డుకు పాఠశాల ఎంపిక అయిందని అన్నారు. చింతలపల్లి హైస్కూల్ క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపిక అవడం పట్ల గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి సురేష్, మాజీ ఉపసభాపతి ఏవి సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనంద రాజు, ఎంపీటీసీ మార్తపూడి ప్రసాద్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, కడలి వెంకట రమణ, ఉప సర్పంచ్ బొక్క రామకృష్ణ, మాజీ రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - పిఠాపురం : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సందర్భంగా కార్యనిర్వాహాధికారి శ్రీరాములు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు విజయ జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, నెమలి పించాలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తొమ్మిది రకాలతో ప్రసాద నివేదన సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా 29వ తారీకు గరుడ వాహనంపై గ్రామ ఉత్సవంతో వేడుకలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

30న శ్రీమదాంధ్ర వేదశాస్త్ర పరిషత్ సభ

విశాలాంధ్ర - కాకినాడ : శ్రీమదాంధ్ర వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30న 70వ వేదశాస్త్ర పండిత సన్మానసభ స్దానిక రామారావుపేట లోనున్న శ్రీగాయత్రి మడపంలో జరుగుతుందని పరిషత్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ శ్రీరామ భగవతీ కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్ సంయుక్తంగా తెలిపారు. ఉపన్యాసకులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్వనాధ గోపాలకృష్ణ (రాజమండ్రి), వేదస్వస్తి నిర్వహకులు శ్రీదత్తాత్రేయ గురుకుల వ్యవస్దాపకులు గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనాపాఠి(రాజమండ్రి) ముఖ్య అతిధులుగా పార్ల మెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెరకటేశ్వరరావు (నానాజీ) పాల్గోంటున్నారని తెలి పారు. ఈసందర్బంగా రాజమండ్రి, విజయవాడ నుండి వచ్చే సభ్యులను సన్మానించడం జరుగుతుందని, సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు.

జర్నలిస్ట్ సురేష్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : గోదావరి కళా కౌముది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్య కళామందిర్‌లో ద్వాదశి వార్షికోత్సవం జరిగింది. దీనిలో భాగంగా ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్ నాయుడు బాజీ బోయిన గౌరవ అధ్యక్షులు కర్రి రామారెడ్డి వారి ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తున్న జర్నలిస్ట్ బిందాన సురేష్‌ను పంతం పద్మనాభం నాటక కళా పరిషత్ వ్యవస్థాపకులు బుర్రపద్మనాభం, సంఘ సేవకులు ఉద్దగల సుబ్బరావు, టీడీపీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ గుడా డైరెక్టర్ బిజెపి నాయకులు గట్టిసత్యనారాయణ, జనసేన నాయకులు ఆకుల వెంకటరమణ, తుమ్మలపల్లి వాసు, దొడ్డిపట్ల అప్పారావు, కాపు సద్భావన సంఘం ఉపాధ్యక్షులు సలాది మూర్తి, తదితరులు దుశ్శాలువతో సత్కరించి మెమెంటోతో ఘన సత్కారం చేశారు.

కొవ్వూరులో చోరీ ... భయాందోళనలో ప్రజలు

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు పట్టణం లోని ఏడవ వార్డు ఐసిఐసిఐ బ్యాంకు పక్కన ఉన్న అపార్ట్మెంట్లో రెండో అంతస్తులు నివాసం ఉంటున్న కట్ట ఉష్శశ్రీ ఇంటిలో రాత్రి దొంగలు పడి సుమారు 50 కాసుల బంగారం రెండు లక్షల నగలు యాక్టివా మోటార్ సైకిల్‌ను దొంగలించినట్లు ప్రాథమిక సమాచారం. దొంగలు అపార్మెంట్ వెనక ఇంటి పైనుంచి అపార్మెంట్ బాల్కనీలోకి ప్రవేశించి ఉష్శశ్రీ జ్యూవెలర్స్ యజమాని అయిన కట్ట ఉష శ్రీ ఇంటిలో ప్రవేశించి బెడ్ రూమ్ లో నిద్రపోతున్న వారి ప్రక్కనున్న అలమర బీరువాలలో ఉన్న బంగారం నగదును అపహరించారు. ఇది సుమారు మూడు నాలుగు మధ్యన జరిగి ఉండవచ్చు. నాలుగున్నరకు ఇంటి యజమాని నిద్ర నుంచి లేచి చూడగా దొంగతనం జరిగిందని గ్రహించి పట్టణ పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు డిఎస్పి డి దేవకుమార్ , పట్టణ సీఐ విశ్వం రూరల్ సీఐ విజయబాబు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్లు , డాగ్స్క్వాములను రప్పించి విచారించారు. చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించారు. అపార్ట్మెంట్ చుట్టుపక్కల ఇళ్లను కూడా దొంగలు దొంగతనానికి చేయడానికి ప్రయత్నించినట్టుగా గుర్తించారు. పోలీస్ విచారణ ఇంకా సాగుతుందని, విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

దైవ యాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు



విశాలాంధ్ర - కొవ్వూరు : దైవ యాత్రలు చేయాలనుకునే భక్తులు సౌకర్యార్థం యాత్ర స్పెషల్ బస్సు లను ఏర్పాటు చేయడం జరిగిందని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి ఎన్ కుమార్ తెలిపారు. మంగళ వారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి నవ శైవ క్షేత్ర దర్శిని బస్సును డిపో మేనేజర్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు ఆర్టీసీ డిపోను ఆదరిస్తున్న ప్రయాణికులకు ప్రత్యేక కృతజ్ఞతలు అని విహారయాత్రలకు దైవ యాత్రలకు వివాహాది శుభకార్యములకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులో ఉంచడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఎక్కువ లాభాలు అందించే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు రైతులకు పిలుపునిచ్చారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామంలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురానికి చెందిన సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జిఎమ్ పి వీరభద్రరావు, అధికార ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు ఆయిల్ ఫాం సాగు ఉపయోగాలు మార్కెటింగ్ తదితర అవకాశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల వరి, అరటి తదితర పంటలు తరచూ పంట నష్టానికిలోనై కర్షకులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారని, ఇటువంటి సందర్భంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నూనె గింజల ఉత్పత్తికి దేశంలో అధిక డిమాండ్ ఉండడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. 30,35 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టడం మంచిదన్నారు. కపిలేశ్వరపురం సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆయిల్ ఫామ్ సాగు అంశంలో రైతులను ప్రోత్సహించడానికి ముందుకు రావడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ సైతం డ్రిప్ ఇరిగేషన్ పథకాలకు సబ్సిడీ అందించడంతో పాటు, ఎన్ఆర్‌జిఎస్, ఉద్యాన శాఖ అను సంధానంగా ఉన్న పథకాలను సైతం రైతులు విని యోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ముత్తాబత్తుల రాజు, నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి వరప్రసాద్ పాల్గొన్నారు.

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : రైతులను పకృతి వ్యవసాయం వైపు మళ్ళించాలని డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియజర్ సూచించారు. మంగళవారం స్త్రీ శక్తి భవనంలో ఏడిఏలకు, ఏవోలకు, విఏ ఏలకు, విహెచ్ఎలకు ప్రకృతి వ్యవసాయంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాపులో ఎలియజర్ మాట్లాడుతూ 365 రోజులు పచ్చదనం, జీవ వైవిధ్యం, పంట వైవిధ్యం, వ్యవసాయంలో పశువుల అనుసంధానం, జీవ ఉత్రే రకాలు వాడకం, దేశి విత్తనాల వాడకం, మల్చింగ్ గురించి వివరించారు. పిఎండిఎస్, ఆర్డిఎస్ ఎటిఎం, ఏ గ్రేడ్, సూర్య మండలం, మోడల్స్ పై అవగహన పరుచుకోవాలన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బీజామృతం, పంచగవ్య, పుల్లటి మజ్జిగ, కోడిగుడ్లు నిమ్మరసం ద్రావణం గురించి తెలియజేశారు. వరిలో బ్లాక్ రైస్, రెడ్ రైస్, బ్రౌన్ రైస్‌లపై రైతుల్లో అవగహన కలిగించి వాటిని సాగు చేసేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏడిఏ గంగాధర్, ఏవో రెడ్ల శ్రీరామ్, విఏఏలు విహెచ్ఎలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రామస్థాయిలో శానిటేషన్ క్లోరిజేషన్ పనులు కార్యదర్శులు సర్పంచులు సమన్వయంగా కృషి చేయాలని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. మంగళవారం మండపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన గ్రామ కార్యదర్శులు సర్పంచుల సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆశ్రయించినంత వేగవంతంగా జరగటం లేదని దీనికి గ్రామ కార్య దర్శులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని దీని నివారణ చర్యలు ముందస్తుగా చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాలలో త్రాగునీటి సరఫరాలో జాగ్రత్త వహించాలని ముఖ్యంగా ట్యాంకులు క్లీనింగ్ చేయాలన్నారు. అధిక గ్రామాలలో గొట్టాల ద్వారా త్రాగునీరు అందుతుందని ఆ స్థాయిలోనే క్లోరినేషన్ చేయాలని అన్నారు. తాగునీరు సరఫరాకు 14వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కూడా స్వచ్ఛమైన త్రాగునీరు అందించడానికి గ్రామపంచాయతీలకు సహకారం అందిస్తానన్నారని దుర్గారావు తెలిపారు . కృష్ణం పాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామానికి మౌలిక సదుపాయాలు కోసం నిధులు సమకూర్చాలని ఇదేవిధంగా సీసీ రోడ్లు డ్రైన్లు కల్వర్టులో నిర్మాణానికి సహకరించాలని కోరారు యాదవోలు సర్పంచ్ సున్నం ప్రసాద్ దుద్దుకూరు సర్పంచ్ బొంత నాగమణి రామన్నపాలెం సర్పంచొ బుల్లారావు దేవరపల్లి సర్పంచ్ వీరకుమారి పంచాయతీలలో శానిటేషన్ క్లోరిజేషన్ పనులు వివరాలను తెలిపారు .

టీడీపీ యాప్ టాప్ పెర్ఫార్మర్‌గా ధూళిపూడి

విశాలాంధ్ర - తాళ్లరేవు : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "మన టిడిపి యాప్" ద్వారా ముమ్మిడివరం నియోజకవర్గంలో అత్యధిక మందికి కంటెంట్ పంపిన 15 మందికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పంపించిన ప్రశంసా పత్రాలను ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ సందర్భంగా మొదటి 3 స్థానాల్లో నిలిచిన ధూళిపూడి సుబ్రహ్మణ్యం, ధూళిపూడి వెంకటరమణ (బాబి), ఉద్దిశ వీరేశ్వరరావులను ప్రత్యేకంగా అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకే ప్రభుత్వం

- సెప్టెంబర్ 1నుండి రెవెన్యూ సదస్సులు
- ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారంకై ప్రజల వద్దకే ప్రభుత్వం అనే నూతన పరివాడికకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటనను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ,ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి రెవెన్యూ అధికారులు నుండి జిల్లా కలెక్టర్ వరకు గ్రామాల్లోనే ప్రజల చెంత రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి చక్కటి వేదిక అని చెప్పారు. భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22 ఏ భూముల అక్రమాలతోపాటు అన్ని రెవెన్యూ సమస్యలపై ప్రతి గ్రామాల్లో జరగనున్న గ్రామ సభలకు తాహశీల్దార్ తోపాటు ఏడుగురు అధికారులు వచ్చి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

నూతన వాటర్ ట్యాంకర్లకు ఎమ్మెల్యే సత్యప్రభ శంకుస్థాపన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఏలూరులో రూ.40 లక్షల 70 వేలతో, అలాగే ఉత్తరకంచి రూ. 29 లక్షల 60 వేలు నూతన వాటర్ ట్యాంకులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ జల జీవన్ మిషను ద్వారా ఇంటింటికీ సురక్షిత మైన త్రాగు నీరు అందించడం కోసం మే ఈ వాటర్ ట్యాంకుల శంకుస్థాపన కార్యక్రమం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, ఉత్తర కంచి సర్పంచ్ మంతెన శ్రీను, ఆర్డబ్ల్యూఎస్ డిఈకె రాఘవేంద్ర రావు, జెఇ కెవి శ్రీరామ్, జనసేన పార్టీ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, టిడిపి సీనియర్ నాయకులు కొమ్ముల కన్న బాబు, అమరాది వెంకట్రావు, ఇళ్ళ అప్పారావు, వాకపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివివిఎస్ఎన్ మూర్తికి మదర్ థెరిస్సా స్మారక పురస్కారం

విశాలాంధ్ర - రాజా నగరం : తమ విద్యా సంస్థలు ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్న వివిధ సేవలను గుర్తించిన ఎక్రేస్ సాహిత్యసేవా సంస్థ అందించిన మదర్ థెరిస్సా స్మారక పురస్కారంతో ఆత్మభినందం కలిగిందని గాయత్రి విద్యాసంస్థలు ఛైర్మన్ వి.వి.వి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. మండలంలోని కానవరం గ్రామంలోని గాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ మూర్తి మంగళవారం విశాలాంధ్రతో మాట్లాడారు. మదర్ థెరిస్సా 114వ జయంతినీ పురస్కరించుకొని ఎక్రేస్ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈ నెల 26న జరిగిన మదర్ థెరిస్సా జయంతి వేడకల్లో, థెరిస్సా స్మారక పురస్కారాలు పేరిట తమ సేవలను గుర్తించడం తో పాటు మాజీ శాసన సభ్యురాలు నన్నపనేని రాజ కుమారి, అతిరథ మహారథులు చేతులు మీదుగా తమకు పురస్కారం అందజేశారన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేవలం 20 మందిని ఎంపిక చేయగా వారిలో తాను ఒక్కరినని చెప్పారు.మదర్ థెరీసా పురస్కారంతో తమకు మరింత బాధ్యతలు పెరిగాయ న్నారు. ఈ సందర్భంగా ఎక్రేస్ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి,ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశా ధికారి సీహెచ్వీ సుబ్బయ్య,నృత్య కళాకారిణి తెలంగాణాకు చెందిన బానోతు అలకనందా రాథోడు లకు కృతజ్ఞతలు చెప్పారు.దీనిలో భాగంగా నియోజకవర్గం లోని పలువురు నాయకులు పురస్కార గ్రహీత మూర్తి కి అభినందనలు తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సమావేశం

విశాలాంధ్ర - అమలాపురం : స్టేట్ వైడ్ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ రాయుడు బాబ్జి ఆధ్వర్యంలో అమలాపురం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సమావేశం అమలాపురం ప్రెస్ క్లబ్ నందు నిర్వహించారు. రాయుడు బాబ్జి ఆధ్వర్యంలో టౌన్ వైడ్ ప్రెసిడెంట్ మట్టపర్తి రాము గత మూడు సంవత్సరాలుగా ప్రెసిడెంట్‌గా కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అభిమానులు ఎన్టీఆర్ ఫ్యాన్స్ యొక్క ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతున్న యువకుడు రాముని ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాబ్జి మాట్లాడుతూ సెప్టెంబర్ 27వ తారీఖున దేవర చిత్రం విడుదల సందర్భంగా అమలాపురం పట్టణం అన్ని థియేటర్ల వద్ద భారీ డెకరేషన్‌తో పలు సేవా కార్యక్రమాలు చేయాలని ఎన్టీఆర్ దేవర చిత్రం అఖండ విజయం సాధించాలని ప్రతి అభిమాని సంబరాలు జరుపు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజర్ కొప్పనాతి వెంకటరాజు, లంకే రవి, ఓలేటి రాంబాబు, గెద్దాడ రాజ్ కుమార్, కుడుపూడి శ్రీనివాస్, నూటుకుర్తి శ్రీనివాస రావు, సిహెచ్ ముఖేష్, మిద్దే దుర్గాప్రసాద్, పాలమూరు సురేష్, లంకే ఉప్పల గుప్తం మండల ప్రెసిడెంట్ లంకే డీఎస్పీ అంగాని లక్ష్మణ్, చిలకలపూడి లక్ష్మణ్, కడలి బుల్లబ్బాయి, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ ప్రెసిడెంట్ కోమానపల్లి రాజు (దయ) తదితరులు పాల్గొన్నారు.

మెగా మెడికల్ క్యాంపు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - అమలాపురం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నల్లా ఇంద్రాణి మెమోరియల్ సౌజన్యంతో జిఎస్ఎల్ హాస్పిటల్ రాజమండ్రి వారిచే మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు నల్లా శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్లో పలువురు జనసేన నేతలు పోస్టరును ఆవిష్కరించారు. ఆగస్ట్ 31, సెప్టెంబర్ 1వ తేదీలలో, ముస్లిం శాధిఖానా, అమలాపురం టౌన్ బ్యాంక్ ఎదురుగా, నల్లవంతేన రోడ్, అమలాపురం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ని ఈమెగా మెడికల్ క్యాంపును నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు జనసేన పార్టీ కౌన్సిలర్స్, వీర మహిళలు, అత్యధిక సంఖ్యలో అమలాపురం నియోజకవర్గ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది పనితీరుపై కౌన్సిల్ అసంతృప్తి

విశాలాంధ్ర - కొవ్వూరు : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం కొవ్వూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో జరిగింది. మున్సిపల్ ఛైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ జోసెఫ్ డానియల్, 16 అంశాలతో కూడిన అజెండాతో పాటు రెండు అంశాలతో కూడిన అత్యవ సర అజెండాను ప్రవేశపెట్టారు. కౌన్సిల్ సభ్యులు అజెండాలోని అంశాలను పరిశీలించి అభిప్రాయం తెలియజేయడంతో చైర్పర్సన్ భావన రత్నకుమారి ఆమోదం తెలిపారు. 15 అంశంలోని పురపాలక సంఘం నందు ఉన్న జెసిబి ను పట్టణ పరిధిలోని ఇతర ప్రభుత్వ సంస్థల పనుల నిమిత్తం అద్దెకివ్వడం అంశంపై కొందరు కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించినప్పటికీ మిగిలిన కౌన్సిల్ సభ్యులు ఆమోదించడంపై రెండు నెలలపాటు, ట్రైల్ రన్ గా జరిపించాలని తెలపడంతో పూర్తి కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. జీరో అవర్లో పట్టణంలో వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పై తీవ్ర దుమారం రేగింది. మున్సిపల్ సిబ్బంది పనితీరుపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల మైన తమకే స్పందించండి మున్సిపల్ సిబ్బంది ప్రజలకు ఏ విధంగా స్పందిస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియల్ మెంబర్ కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులుగా మన బాధ్యత అని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలోని అంశాలను పరిశీలించి అనంతరం ప్రజా సమస్యలపై మాట్లాడారు. కొవ్వూరు పట్టణ పరిధిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అన్నారు గోదావరి నది తీరం ఉన్నప్పటికీ గోదావరి నీరు తాగే పరిస్థితులు కొవ్వూరు పట్టణ ప్రజలకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. బోర్ నీరు తాగుతూ అనారోగ్యాలు పాలవుతున్నారని క్షేత్రస్థాయిలో గోదావరి జలాలను పట్టణ ప్రజలకు అందించడంలో కౌన్సిల్ సభ్యులు సహకరించాలని కోరారు. అంచలంచలుగా వీధి దీపాలు వెలిగించడంలో మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ప్రధాన సమస్య పారిశుద్ధ్య నిర్వహణ పై మున్సిపల్ సిబ్బంది అలసత్వాన్ని ప్రతిఘటించారు. కౌన్సిల్ డంపింగ్ యార్డ్ సమస్యను తీసుకురావడం పట్ల స్పందించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శాసనసభ్యులుగా ఎన్నికైన నాటినుండి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని ఒకేసారి కాకుండా అంచలు అంచెలుగా ఒక్కొక్క పని నిర్వహించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కొవ్వూరు పట్టణాన్ని సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో కౌన్సిల్ సభ్యులు తమతో కలిసి పనిచేయాలని పట్టణాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షులు కాకర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నడింపల్లి మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : గెద్దనపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు నడింపల్లి రామకృష్ణంరాజు మంగళవారం మృతి చెందారు. ఈయన సుదీర్ఘ కాలం పాటు సిపిఎం పార్టీకి సేవలందించారు. ప్రజా సమస్యలపై విశ్రాంతి పోరాటం చేశారు. ఉపాధ్యాయ సంఘాలలో తన వాణి వినిపించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

అమరావతిలో డిప్యుటేషన్ పై ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె యూనివర్శిటీ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా విధులు నిర్వర్తిస్తున్న జి మోహన్ ప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా సిఆర్‌డిఏకు డిప్యుటేషన్‌పై పంపిస్తూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తుర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ కళాశాల స్థాయి నుండి యూనివర్శిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత యూనివర్శిటీ అభివృద్ధికి వివిధ హోదాలలో 34 సంవత్సరాల పాటు జి.మోహన్‌ప్రసాద్ విశేష సేవలందించారన్నారు. ప్రతిభా సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సిఆర్‌డిఏ అమరావతిలో డిప్యుటేషన్‌పై వెళ్ళడం పట్ల గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. జి మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజధాని నిర్మాణంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, అమరావతి అభివృద్ధికి తన వంతు కృషి చేసి జెఎన్‌టియుకె ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తానన్నారు. డిప్యుటేషన్‌పై వెళ్తున్న జి మోహన్ ప్రసాద్‌ను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణతో పాటు రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ డి కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా జి శ్యామ్‌కుమార్, ఏఈఈలు సిహెచ్ సన్నీ ఫ్రాన్సిస్, నవీన్, డిప్యూటీ రిజిస్ట్రార్ హెచ్‌ఆర్ నాగేశ్వరరావు అభినందించారు.

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సత్యప్రభ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండల అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్య ప్రభ హాజరయ్యారు. ఎమ్మెల్యే సత్య ప్రభను సర్పంచులు, ఎంపీటీసీలు గజమాలతో సత్కరించారు.

కాయర్ బోర్డు నిరాకరణ వల్ల కొబ్బరి పరిశ్రమకి నష్టం

విశాలాంధ్ర - అమలాపురం : కాయర్ బోర్డు సంస్థల సహాయ నిరాకరణ వల్ల కొబ్బరి పరిశ్రమకి నష్టం కలుగుతుందని భారతీయ కిసాన్ సంఘ్ ఆల్ ఇండియా కోకోనట్ కన్వీనర్ సుందర రాజన్ అన్నారు. అమలాపురం సంహిత భవన్లో సుందర్ రాజన్ అధ్యక్షతన జరిగిన దక్షణాధి రాష్ట్రాల కొబ్బరి రైతుల సమస్యలు.. పరిష్కార సూచనల చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొబ్బరి సాగు, యాజమాన్య పద్ధతులు, కొబ్బరి కాయ సేకరణ, రవాణా, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అవకాశాలలో ఎదురవుతున్న సమస్యలను, వాటికి పరిష్కారాలను వారు సూచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ), కాయర్ బోర్డు, పరిశ్రమల సంస్థలు, ఏజెన్సీల సహాయ నిరాకరణపై సుదీర్ఘ చర్చ జరిగింది. బుధవారం అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో జరిగే రెండవ రోజు సదస్సులో మరోసారి చర్చించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించనున్నట్టు బీకేఎస్ ప్రతినిధులు తెలిపారు. ఎండు కొబ్బరితోపాటు కొబ్బరి బోడకాయ (వలుపు వలిచిన కాయ)ను కేజీ రూ.45 ధర నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)ల ద్వారా కూడా కొబ్బరి కొనుగోలు చేయాలనే ప్రధాన తీర్మానాలతో పాటు దింపు యంత్రాలను రాయితీలపై అందించడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో)ల ఏర్పాటుకు సహకారం, మార్కెటింగ్ సౌకర్యాలు పెంచడం, వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా సౌకర్యం, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను తక్కువ ధరకు అందించడం, కొబ్బరి చెట్టును ఔషద గుణమైన చెట్టుగా గుర్తించడం, కొబ్బరిని పరిశ్రమగా గుర్తింపుతోపాటు రాయితీల కల్పన, పాత చెట్ల తొలగింపు పథకం ఆర్అండ్ఆర్‌ను ప్రోత్సాహాన్ని చెట్టుకు రూ.వెయ్యి నుంచి రూ.2,500లకు పెంపు వంటి పలు తీర్మాణాలు చేశారు. బికెఎస్ నాయకులు మోహన్ మిశ్రా, జలగం కుమారస్వామి, ఉప్పుగంటి భాస్కరరావు, యాల్ల వెంకటనందం, అడ్డాల గోపాల కృష్ణ, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - కరప : రైతులు ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, విఏఏలు కృషి చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ జే ఎలియాజర్ పేర్కొన్నారు. కరప మండలం గురజానపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చినట్టు ఏవో రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జె ఎలియాజర్, ఏడిఏ బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పొలా న్ని పచ్చగా కప్పి ఉంచే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని దీనికి సంబంధించి తొమ్మిది సూత్రాలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కాజులూరు ఎంఏవో అశోక్, తాళ్ళరేవు ఎంఏవో ప్రశాంతి, ధనలక్ష్మి, ఎంటి రామలక్ష్మి, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

బంజర భూములకు పట్టాలు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: అటవీ బంజర భూముల్లో 50 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్న పేద, బలహీన వర్గాలకు పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో సాగుదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో సాగుదారులు ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారన్నారు. మూడు తరాలు సాగులో ఉన్న భూములకు మాత్రమే పట్టాలు ఇవ్వాలనే చట్టాన్ని సవరించాలన్నారు. గతంలో ఎందరో కమ్యూనిస్టు నాయకులు పేదల పక్షాన నిలబడి భూ పోరాటాల ఫలితంగా భూములను పేదలకు పంపిణీ చేశార న్నారు. ఈ భూములు మూడు తరాలు సాగులోనే వున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు నోటీసులకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సీపీఐ నాయకులు పుల్లారావు, అటవీ బంజర భూముల సాగుదారులు అబ్బూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చ కండువా వేసుకున్న వైసీపీ నేతలు

- మంత్రి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఎట్టకేలకు అనుకున్న ప్రకారం ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు పచ్చ కండువా వేసుకున్నారు. కొద్ది రోజులుగా నగర మేయర్ దంపతులు టీడీపీలో చేరుతారనే ప్రచారానికి మంగళవారం వారిరువురూ ఫుల్ స్టాప్ పెట్టారు. ఈ మేరకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో అధికారికంగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ తరుణంలో మేయర్ దంపతులను లోకేష్ పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మేయర్ దంపతులతో పాటు వైసిపి నగర అధ్యక్షుడు, మాజీ ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, మాజీ స్మార్ట్ సిటీ చైర్ పర్సన్ బొద్దాని అఖిల ప్రియలు సైతం లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. దీంతో ఏలూరులో వైకాపా తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చు. పార్టీలో కీలక నేతలుగా ఉన్న వ్యక్తులంతా ఒకేసారి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ద్వితీయ శ్రేణి కేడర్ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని చెప్పవచ్చు.

ప్రజా సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువ కావాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువవ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి వివిధ శాఖల జిల్లా అధికా రులతో మీకోసం పి జి ఆర్ ఎస్ అర్జీల పరి ష్కారంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు అర్జీదారుని సమస్యను మేలైన రీతిలో పరిష్కరించి వారికి చేరువకావాలన్నారు.ఎంతోమందికి రాని అవకాశం మనకు ప్రభుత్వ ఉద్యోగం ద్వారా కలిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల సంక్షేమానికి పాటుపడాలన్నారు. సకాలంలో స్పందించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలో పేర్కొన్న అంశంలోని ప్రాధాన్యతను బట్టి ఒక్కొక్క అర్జీకి ఒక్కొక్క సమయం ఉంటుందని, అది 24 గంటల నుండి 120 రోజుల లోపుగా పరిష్కరించేందుకు ఆన్లైన్ లోనో షెడ్యూ ల్ సమయం నిర్ణయించి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డా.కె.సి.హెచ్ అప్పారావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, పిడి డిఆర్డిఏ ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, డ్వామా పిడి ఎం.ప్రభాకర్‌రావు, డి.ఎం అండ్ హెచ్.ఓ డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక రూపొందించడం ద్వారా గృహ నిర్మాణ పనులు చేపట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం పి ఎమ్ ఏ వై గృహ నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, గృహ నిర్మాణ లక్ష్య సాధనలో నిర్ణాయక పాత్ర, సరైనా ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టడం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల మేరకు పనులు చేపట్టాలని, విధి నిర్వహణలో స్తబ్దతగా ఉంటే ఎలా? అని ప్రశ్నించారు. మీరు నిర్దేశించుకున్న హౌసింగ్ పనులకి ఉపాధి హామీ పని దినాలను అనుసంధానం చేసే దిశలో ఏపీఓ లతో సమావేశ నిర్వహించడం, జాబ్ కార్డు లేని వారికి వాటిని కల్పించడం పై చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాలు కల్పన, ఆ రోజులకు వేతనం, మెటీరియల్ కింద ముడిసరుకు, అదనపు ఋణ సౌకర్యం కల్పించడం జరగాలని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో హౌసింగ్ నిర్మాణాల కోసం అదనపు ఋణ సౌకర్యం కల్పించడం జరగాలన్నారు. ప్రభుత్వ హౌసింగ్ లే అవుట్ స్థానిక సంస్థలు ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పట్టణ, గ్రామీణ పరిధిలోకి వచ్చే స్థానిక సంస్థల అధికారులు చర్యలు తీసుకోవడం తప్పనిసరి అన్నారు. లేఔట్ లలో ఇళ్లు నిర్మించిన లబ్దిదారులకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డీసీ/ఇన్చార్జి హౌసింగ్ పిడి ఆర్. కృష్ణ నాయక్, పిడి డీఆర్డీఏ ఎన్వివిఎస్ మూర్తి, డిపివో డి. రాం బాబు , హౌసింగ్ ఈ ఈ లు జీ. పరశురామ్, సూరిబాబు, డీఎల్డివో పి. వీణా దేవి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎమ్. నాగలత పాల్గొన్నారు.

31వరకు నేషనల్ స్పోర్ట్స్‌డే సెలబ్రేషన్స్

విశాలాంధ్ర - కాకినాడ : నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకూ కాకినాడ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడలతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. అయా పాఠశాల విద్యార్థులచే "ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ" చేయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 28వ తేదీన స్పోర్ట్స్ ఈవెంట్స్ 18 నుంచి 40 సంవత్సరాల వయసు గల వారికి 100 మీటర్స్ రన్నింగ్ రేస్, బ్రిస్క్ వాక్, వాలీబాల్, త్రో బాల్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్, 40 నుంచి 60 సంవత్సరాల వయసు వారికి 50 మీటర్ల రన్నింగ్, 300 మీటర్ల వాకింగ్, టగ్ ఆఫ్ వార్, ఇండోర్ గేమ్స్, షటిల్, 60 సంవత్సరాల పైబడిన వారికి 30-50 మీటర్ల వాకింగ్, యోగ పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 29వ తేదీన చిల్డ్రన్స్‌కు గేమ్స్, స్పోర్ట్స్ నిర్వహించడం జరుగుతుందని మూడు కిలోమీటర్ల లాంగ్ ర్యాలీ ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ డిపార్ట్మెంటల్ స్థాయిలో గేమ్స్ మహిళలకు, పురుషులకు వేరువేరుగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ తగ్గ ఆఫ్ వార్, క్రికెట్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 30వ తారీఖు నుండి 31వ తారీకున పాఠశాల, కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు స్పోర్ట్స్ క్విజ్ అండ్ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

విశాలాంధ్ర - కాకినాడ : అన్నవరంలోని శ్రీ సత్యనారాయణ స్వామి వారి ప్రసాదానికి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపునిస్తూ జారీ చేసిన ధృవపత్రాన్ని ది.27.08.2024 మంగళవారం సాయంత్రం కాకినాడ పార్ల మెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ చేతుల మీదుగా జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ, రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్ ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డా ఎం రమేష్‌ల ఆధ్వర్యంలో ఎంపి క్యాంప్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లా డుతూ జెఎన్‌టియుకె, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ఆర్థిక సహకారంతో 2014లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీలో ఆహార నాణ్యతా పరీక్షల కోసం ఏర్పాటుచేసిన ప్రయోగశాల విజయవంతంగా నడుస్తోందన్నారు. రాష్ట్రంలో అన్నవరం దేవస్థానం ప్రసాదం తయారీకి మొట్టమొదటిసారిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవపత్రాలు జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఉపకులపతికి సూచించారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ఏబిఎల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గుర్తింపుతో కూడిన ప్రయోగశాల కాకినాడ జెఎన్‌టియుకెలోని ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒక్కటేన న్నారు. ఈ ధృవీకరణ పత్రాన్ని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి ప్రధానం చేస్తారన్నారు. ఈ సర్టిఫికెట్ జారీలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫాస్టాగ్ ట్రైనింగ్ ఫార్టనర్‌గా జెఎన్‌టియుకె స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ ఎం రమేష్ కీలకపాత్ర పోషించగా కాకినాడ అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ బి శ్రీనివాసరావు తన వంతు సహకారం అందించారు. అదేవిధంగా జెఎన్‌టియుకె యూనివర్శిటీకి ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి మొత్తం రూ.13.55కోట్ల నిధులు అవసరం కాగా కేంద్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ట్రాక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ని ఉపకులపతి కోరారు. జెఎన్‌టియుకెలోని ఫుడ్ టెక్నాలజీ ప్రయోగశాల సేవలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆహార పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు వినియోగించుకునేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ, రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డా ఎం రమేష్, ఆదికవి నన్నయ యూనివర్శిటీ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ హబీబ్ భాషా పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి : జేసీ ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో రైతు సేవా కేంద్రాన్ని, చేబ్రోలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీని, నాచుకుంటలోని గాయిత్రి ట్రేడర్స్ రైస్ మిల్లును జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి పరిశీలించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వసతులు, ఏర్పాట్లను అధికారులతో ఆమె సమీక్షించారు. గాయిత్రి రైస్ మిల్లు స్టోరేజ్ కెపాసిటీ, తేమ శాతం కొలిచే యంత్రాలను, బ్లెండింగ్ మిషన్ పనితీరు, అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రైస్ మిల్లులో 70 వేల గోనె సంచులు అందుబాటులో ఉండగా వాటన్నింటిని ధాన్యం కొనుగోలుకు అనువుగా ఉండేటట్లు చూడాలన్నారు. బ్యాంక్ గ్యారంటీని సిద్దం చేసుకోవాలని రైస్ మిల్లు యాజ మాన్యానికి ఆదేశించారు. సొసైటీని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కంప్యూటరీకరణ తీరును పరిశీలించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కార్యకలాపాలకు సంబంధించి సొసైటీ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షించారు. అనంతరం ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్. రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవి, డిసివో శ్రీనివాస్, ఎడిఎ ఉషారాణి, తహ శీల్దారు సతీష్, మార్కెటింగ్, రెవెన్యూ, అధికారులు ఉన్నారు.